

ఉష్ణోగ్రత (అంచనా)

15-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	28
తెనాలి	35	28
నరసరావుపేట	35	26
బాపట్ల	35	28
రెంటచింతల	36	26
చీరాల	35	28

ధాన్యం.. ధనమేది?

- రైతులకు రూ.25.33 కోట్లు బకాయి
- పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అన్నదాతల ఆందోళన
- 24 గంటల్లో చెల్లింపులని.. నెల దాటినా అందని వైనం
- ఖరీఫ్ సాగుకు డబ్బు అందుతుందా లేదా అన్న ఆందోళన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ముప్పాళ్ల మండలానికి చెందిన రైతు చలపతిరావు రైతు సేవా కేంద్రం ద్వారా 94.4 క్వింటాళ్ల ధాన్యం గత నెల 10న విక్రయించారు. ఇదే మండలానికి చెందిన కోటేశ్వరరావు 44 క్వింటాళ్లు, వెంకటేశ్వర్లు 6.4 క్వింటాళ్ల ధాన్యం 36 రోజుల క్రితం ధాన్యం విక్రయించారు. అయితే వీరి ముగ్గురి ఖాతాల్లో నేటికి ఒక్క రూపాయి కూడా నగదు జమ కాలేదు. వీరు ముగ్గురే కాదు పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఇలాంటి వారు వందల సంఖ్యలోనే ఉన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో నగదు చెల్లిస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్తున్నారు. అయితే ఆ మాటలు అమలుకు నోచుకోవడం లేదు. ధాన్యం విక్రయించి నెల దాటినా, నేటికీ చేతికి ధనం అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడికి నగదు అందివ్వాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం విక్రయించినా నగదు చేతికి అందకపోవడంతో అప్పులకు వడ్డీ పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధాన్యం నిల్వలు

అన్నదాతల అయోమయం..

ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి నగదు చెల్లింపులో జాప్యం జరిగితే న్యాయం కోసం రైతులు ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తారు. అయితే ప్రభుత్వమే కొనుగోలు చేసి, చెల్లింపుల్లో జాప్యం చేస్తుండటంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో రైతులున్నారు. మద్దతు ధర లభిస్తుందనే ఆశతో వందలాది మంది రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించారు. పల్నాడు జిల్లాలో 359 మంది రైతులకు రూ.6.33 కోట్లు, బాపట్ల జిల్లాలో 1200 మంది రైతులకు సుమారు రూ.19 కోట్లు చెల్లించాలి. ధాన్యం డబ్బు ఎప్పుడు వస్తుందో తెలుసుకునేందుకు రైతులు రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాల శాఖ డీఎం నారదమణిని వివరణ కోరగా ఎఫ్‌సీఐ నుంచి నిధులు విడుదలలో జాప్యం జరిగిందని, త్వరలోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు.



డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు దంపతులను సత్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు పుల్లారావు, యార్లగడ్డ, మన్నవ మోహనకృష్ణ, తులసీ రామచంద్రప్రభు

కష్టపడే వారికే గుర్తింపు

- నామినేటెడ్ పదవుల్లో సిఫార్సులుండవ్
- జగన్‌లాంటి వ్యక్తులను రాకుండా చూసుకోవాలి
- 'తల్లికి వందనం' పథకంతో వైసీపీకి మరణ శాసనం
- క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా ఒక్కొక్కటిగా హామీల అమలు
- డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం సత్కార సభలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో ఎవరి సిఫార్సులుండవని, కష్టించి పనిచేసిన కార్యకర్తలకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు తప్పక గుర్తింపు ఇస్తారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడి అభినందన సభ స్థానిక ఏ కన్వెన్షన్ హాల్లో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పెమ్మసాని మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా ఇచ్చిన హామీల కోసం సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అమలు చేసిన 'తల్లికి వందనం' పథకం వైసీపీకి మరణ శాసనం లాంటిదన్నారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా అహర్నిశలు కృషి చేస్తున్న చంద్రబాబు నాయకత్వం కావాలని, జగన్‌లాంటి విధ్వంసకారుడు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పార్టీలో కష్టించి పనిచేసిన వారందరికీ పదవులు వస్తాయని, ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు.

డీసీసీబీల్లో దోపిడీ: గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

వైసీపీ హయాంలో జిల్లా సహకార సెంట్రల్ బ్యాంకుల్లో ఆ పార్టీ నాయకులు పందికొక్కుల్లా దోచుకుతిన్నారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఆరోపించారు. డీసీసీబీల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని, అవినీతిపరులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అనంతరం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఏపీ ఐటీ సంస్థ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తులసీ గ్రూపు సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కూటమి నేతలు పాటిబండ్ల నాగేశ్వరరావు, తాడిశెట్టి మురళీమోహన్, తాళ్ల వెంకటేష్‌యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, కన్నా రవిదేవరాజ్, కార్పొరేటర్లు హరిబాబును ఘనంగా సత్కరించారు.



హాజరైన అభిమానులు, కార్యకర్తలు

రక్త నిల్వలను పెంచేందుకు కృషి

- రెడ్ క్రాస్‌ను వైసీపీ కలుషితం చేసిందంటూ వ్యాఖ్యలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరు(తూర్పు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రక్త నిల్వలను గణనీయంగా పెంచేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకుని శనివారం గుంటూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి 5 లక్షల 33 వేల యూనిట్లు అవసరమని, ప్రభుత్వం, స్వచ్ఛం ద సంస్థలకు చెందిన బ్లడ్ బ్యాంకుల్లో దాదాపు 7 లక్షల యూనిట్లు అందు బాటులో ఉన్నాయన్నారు. దానిని 10 లక్షలకు పెంచేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. రోజురోజుకి పెరుగుతున్న రక్తహీనత, క్యాన్సర్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ఈ నిల్వలను మరింతగా పెంచాలన్నారు. రక్త సేకరణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది అవసరమైన 5 లక్షల యూనిట్లలో 20 శాతం రెడ్ క్రాస్ ద్వారానే అందుతుందని చెప్పారు. అటువంటి రెడ్ క్రాస్‌ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా కలుషితం చేసిందన్నారు.



ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

నేడు గుంటూరుకు కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్

- పొగాకుబోర్డులో ఉన్నతస్థాయి సమీక్ష

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం గుంటూరుకు రానున్నారు. న్యూఢిల్లీ నుంచి గన్నవరానికి చేరుకునే ఆయన మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు ఉండవల్లిలో సీఎం చంద్రబాబుతో సమావేశమౌతారు. ఆ తర్వాత రోడ్డు మార్గాన టుబాకో బోర్డు కార్యాలయానికి చేరుకుంటారు. ఎన్‌ఐసీడీసీ(నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్), టుబాకో బోర్డు, ఎన్ఐడీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్స్)పై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తారు. ప్రధానంగా బర్లీ పొగాకుని ట్రేడర్లు కొనుగోలు చేయకపోతుండటంతో గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో రైతులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పొగాకు బోర్డు అధికారులు, సంబంధిత ట్రేడర్లు, రైతు సంఘాల నేతలతో ఆయన సమావేశమై సమీక్షించే అవకాశం ఉన్నది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ)కి సంబంధించి అమరావతి రాజధానిలో పెండింగ్ పనులున్నాయి. వీటి పైనా కేంద్ర మంత్రి సమీక్షించనున్నారు.

లక్ష్యం.. సాధించారు

- నీట్‌లో మెరిసిన గుంటూరు విద్యార్థులు
- పేదలకు మెరుగైన వైద్యం అందిస్తామంటున్న ర్యాంకర్లు

గుంటూరు(విద్య), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కావడమే లక్ష్యంగా భావించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం.. అధ్యాపకుల సహకారంతో నీట్‌లో మెరిశారు. లక్ష్యం కోసం అకుంఠిత దీక్షతో కృషి చేసి లక్షల మంది పోటీ పడిన నీట్ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించారు. మే 4న నీట్ పరీక్ష జరగ్గా అందుకు సంబంధించిన ఫలితాలను ఎన్‌టీఏ శనివారం విడుదల చేసింది. ఈ పరీక్షలో గుంటూరుకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వివిధ విభాగాల్లో ర్యాంకులు సాధించిన కొంతమంది విద్యార్థులు తమ లక్ష్యాలను ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పేదలకు డాక్టర్‌గా సేవ చేస్తా



వైద్య విద్య పూర్తి చేసి పేదలకు సేవ చేస్తాను. ఢిల్లీ ఎయిమ్స్‌లో సీటు సాధించి వైద్య విద్య పూర్తి చేస్తాను. అనంతరం న్యూరాలజీలో స్పెషలైజేషన్ చేయాలనేది లక్ష్యం. గుంటూరులోని భారత్‌పేటలో ఉంటాం. తల్లి విజయ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకురాలు. తండ్రి భానుప్రకాశ్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడు.

- విక్రాంత్, 9వ ర్యాంకు(ఎస్సీ విభాగం)

రైతు కుమార్తె డాక్టర్



గుంటూరులోని దేవాపురంలో ఉంటాం. తండ్రి కృష్ణారెడ్డి రైతు. తల్లి సునీత గృహిణి. చిన్నప్పటి నుంచి తల్లిదం డ్రులు డాక్టర్ కావాలని తనను ప్రోత్సహించారు. ర్యాంకు సాధనలో అధ్యాపకుల శిక్షణ ఎంతో ఉపయోగపడింది. పేదలకు సేవలు అందిస్తాను.

- నాగిరెడ్డి మనస్విని, 49వ ర్యాంకు(ఈడబ్ల్యూఎస్)

జిప్మర్‌లో సీటే లక్ష్యం



జిప్మర్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేయడమే లక్ష్యం. నీట్ పరీక్ష కోసం తల్లిదండ్రులు రెబా విద్య, రత్నాకర్ చేసిన కృషి మరువలేను. విదేశాల్లో ఉండే తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేసి తమ చదువు కోసం గుంటూరు వచ్చారు. వైద్య విద్య తర్వాత పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాను.

- ఎస్పీ జడ్సన్, 108వ ర్యాంకు (ఎస్సీ విభాగం)

ఢిల్లీ ఎయిమ్స్‌లో చదవాలి



జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య విద్య పూర్తి చేస్తాను. ప్రకాశం జిల్లా యర్ర గొండపాలెం మాది. అయితే గుంటూరులో విద్యను అభ్యసించా. తల్లి తిరుపతీబాయ్ గృహిణి. తండ్రి ఏసానాయక్ గ్రామంలోనే ఉపాధ్యాయుడిగా పని చేస్తారు. ఎంబీబీఎస్ తర్వాత న్యూరో సర్జన్‌గా గ్రామీణ పేదలకు వైద్యం అందిస్తాను.

- ఆర్ తరుణ్‌కుమార్, 51వ ర్యాంకు (ఎస్టీ విభాగం)

చినతురకపాలెం విద్యార్థిని ప్రతిభ



నరసరావపేట టౌన్ : నీట్ ఫలితాలలో నరసరావు పేట మండలం చినతురకపాలేనికి చెందిన షేక్ నసీమా ఈడబ్ల్యూఎస్ కేటరిగిలో 80వ ర్యాంకు సాధించింది. 720 మార్కులకు 603 మార్కులు సాధించింది. నరసరావు పేటలో పదో తరగతి వరకు , ఇంటర్ గుంటూరులో చదివింది. తల్లిదండ్రులు షేక్ నబిసకినా, మహబూబ్‌సుభాని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లుగా పని చేస్తారు.

గుడికెళ్లే.. వృద్ధురాళ్లే టార్గెట్

- వరుస చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నేరస్థుడి అరెస్టు
- రూ.30లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

7

రూ.10.36 కోట్లు చెల్లించినా.. తాత్సారం

- రైల్వేకు స్థలం కేటాయింపుపై రెవెన్యూ నిర్లక్ష్యం
- ఈ కారణంగా నిలిచిపోయిన స్టేబుల్ లేన్ల నిర్మాణం
- కేంద్ర మంత్రి పెమ్మసాని దృష్టికి తీసుకెళ్లిన రైల్వే అధికారులు

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేస్టేషన్ యార్డు పక్కనే స్టేబుల్ లేన్ల నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని రైల్వే శాఖకు స్వాధీనం చేయడంలో రెవెన్యూ శాఖ తాత్సారం చేస్తోంది. ఆ స్థలానికి రెవెన్యూ శాఖ విలువ కట్టిన మేరకు రూ.10.36 కోట్లు చెల్లించి ఏడాది గడిచినా ఇంతవరకు భూమిని రైల్వేకు ఇవ్వలేదు. ఎన్నిసార్లు రిమైండర్లు పెట్టినా కలెక్టరేట్ వర్గాల నుంచి స్పందన కొరవడుతున్నది. దీంతో స్టేబుల్ లేన్ల నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇదే విషయాన్ని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు నివేదించారు. దీనిపై ఆయన జేసీ భార్గవతేజ, ఆర్డీవో శ్రీనివాసరావుని వివరణ కోరారు. గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి కంకరగుంట రోడ్డు ఓవర్ బ్రిడ్జి వరకు రెండు స్టేబుల్ లేన్లను మెడికల్ కళాశాల వైపున నిర్మించేందుకు రైల్వేశాఖ అనుమతులను పొందింది. అయితే ఇక్కడ రైలుమార్గం ఒంపుగా ఉండటంతో కొంత భూసేకరణ అవసరం ఏర్పడింది. దాంతో ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్స్‌ని రూపొందించి నివేదించగా రైల్వే కోరిన స్థలాన్ని కేటాయించేందుకు రూ.10.36 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాలని రెవెన్యూ శాఖ నివేదించింది. ఆ మేరకు రైల్వే శాఖ నిధులను డిపాజిట్ చేసి తన స్థలంలో చాలా వరకు పనులు చేసింది. అయితే రెవెన్యూ శాఖ భూమిని కేటాయించకపోవడంతో స్టేబుల్ లేన్ల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ కారణంతో మళ్లీ తుమ్మచెట్లు మొలిచాయి. అంతేకాకుండా రైల్వే యార్డుకు తగిన రక్షణ లేకపోవడంతో పశువులు రైలుపట్టాల మీదకు వచ్చేస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయాందోళన ఈ ప్రాంతంలో నెలకొన్నది. స్టేబుల్ లేన్ల నిర్మాణం రైల్వే శాఖకు ఎంతగానో అవసరం.



స్టేబుల్ లేన్లు నిర్మించాల్సిన ప్రదేశం

స్టేబుల్ లేన్లు ఉంటే...

ప్రస్తుతం రాత్రి వేళలో గుంటూరుకు వచ్చి నిలిచిపోయే రైళ్లలో కొన్నింటిని పిట్‌లైన్‌కు తీసుకెళ్లి క్లీనింగ్ చేస్తున్నారు. మిగతా వాటికి స్టేబుల్ లేన్లు లేకపోవడంతో వేజండ్ల, బండారుపల్లి, నల్లపాడు వంటి రైల్వేస్టేషన్లకు తీసుకెళ్లి అక్కడ లూప్ లైన్లలో పెడుతున్నారు. అదే గుంటూరు రైల్వేస్టేషన్‌కు 50 మీటర్ల దూరంలోనే స్టేబుల్ లేన్లు ఏర్పాటై ఉంటే రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు దిగిపోగానే వెంటనే వాటిని ఆ లేన్ల మీదకు తీసుకెళ్లి పార్కింగ్ చేయొచ్చు.

బియ్యాన్ని బొక్కేశారు

- ఎండీయూల దారి మళ్లింపు బట్టబయలు
- ప్రతీ నెలా గుంటూరులో 5 శాతం పక్కదారి
- బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కనిపించని వ్యత్యాసం

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్ వ్యవస్థ ప్రతీ నెలా నాలుగు నుంచి ఐదు శాతం రేషన్ సరుకులను దారి మళ్లించేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఎండీయూలను తొలగించి రేషన్ డీలర్ల ద్వారా తిరిగి సరుకుల పంపిణీ ప్రారంభించిన దృష్ట్యా ఈ నెల డిస్ట్రిబ్యూషన్ ఆదివారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన పంపిణీ గణాంకాలను పరిశీలిస్తే పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గతంలో ఎండీయూలు, ప్రస్తుతం డీలర్ల ద్వారా పంపిణీలో పెద్దగా వ్యత్యాసం కనిపించలేదు. గుంటూరులోనే దాదాపుగా ఐదు శాతం వరకు తక్కువగా కార్డుదారులకు సరుకుల పంపిణీ జరిగింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే ఆ ఐదు శాతం ఎండీయూలు కార్డుదారుల వద్దకే వెళ్లి ఈ-పోస్ యంత్రాల్లో వేలిముద్రలు వేయించి సరుకులు పక్కదారి పట్టించినట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎండీయూల ద్వారా రేషన్ పంపిణీని వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిందో ఆ నెల నుంచి గణనీయంగా పెరిగింది. గతంలో 87 నుంచి 88 శాతం మధ్య ఉండగాఎండీయూ వ్యవస్థ వచ్చిన తర్వాత ఒక్కసారిగా పంపిణీ శాతం 92 దాటిపోయింది. అదేమంటే తాము గడప గడపకు వెళ్లి సరుకులు ఇస్తున్నాం కాబట్టి అందరూ తీసుకొంటున్నారని బుకాయించేవారు. ఏ నెల చూసుకొన్నా గుంటూరులో ఇదే పరిస్థితి. ఇందుకు కారణం కార్డుదారులతో వేలిముద్రలు వేయించి బియ్యం కేజీకి లెక్కకట్టి నగదు చేతిలో పెట్టి ఆ బియ్యాన్ని నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకొనేవాళ్లని అర్థమవుతోంది. ఇప్పుడు రేషన్ డీలర్ల ద్వారా సరుకుల పంపిణీ జరుగుతుండటంతో బియ్యం అవసరం లేని వాళ్లు షాపులకు వెళ్లడం లేదు. ఈ కారణంగానే గుంటూరు జిల్లాలో పంపిణీ శాతం ఎండీయూ వ్యవస్థ అమల్లోకి రాక ముందు ఎంత శాతం ఉండేదో ఇప్పుడు కూడా అదే స్థితికి చేరుకున్నది. ఆదివారం మహా అయితే ఒక శాతం మించి సరుకులు తీసుకునే పరిస్థితి ఉండదు.

గత ఐదు నెలల్లో పంపిణీ శాతం ఇలా...

జిల్లా	కార్డుల సంఖ్య	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్
గుంటూరు	589531	92.50	92.38	92.66	91.42	87.17
పల్నాడు	634893	88.08	86.39	86.21	85.98	85.87
బాపట్ల	476529	86.26	86.23	86.05	86.90	85.32



ఆత్మగౌరవ దీక్షలో మాట్లాడుతున్న మల్లికార్జునరావు

ఆ మాటలనే వారంతా.. మహిళా వ్యతిరేకులే

అమరావతి పరిరక్షణ నాన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ మల్లికార్జునరావు

గుంటూరు(తూర్పు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దేవతల రాజధాని అయిన అమరావతి గురించి దూషించేవారంతా మహిళా వ్యతిరేకులేనని అమరావతి పరిరక్షణ నాన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ పిడికిటి మల్లికార్జునరావు తెలిపారు. అమరావతి మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ లాడ్జి సెంటర్లో అమరావతి పరిరక్షణ నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఆత్మగౌరవ దీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిని ఆంధ్ర రాజధానిగా ఏర్పాటు చేసుకోవడం ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించదగ్గ విషయమన్నారు. కాగా కొంతమంది అజ్ఞానులు అనాలోచితంగా మహిళా లోకాన్ని అవమానపరుస్తూ వారి మనోభావాలు దెబ్బతీస్తున్నారని తెలిపారు. అమరావతి పరిరక్షణ నాయకులు పువ్వాడ సుధాకర్, రావుల వెంకయ్య మాట్లాడుతూ మహిళల ఆత్మ గౌరవం దెబ్బతినే విధంగా వ్యవహరించిన కేఎస్ఆర్‌ను, జర్నలిస్టు కృష్ణంరాజును ప్రోత్సహించిన జగన్ మీడియా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, అమరావతి పరిరక్షణ నాయకులు రత్నాకర్ నరసింహారావు, సురేష్, దుర్గాల శ్రీనివాస్, వాకా వీరారెడ్డి, పచ్చలశివాజీ, మురళీకృష్ణ సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, నాయకుడు రావుల అంజిబాబు, టీడీపీ, జనసేన మహిళా నాయకులు గుడిపల్లివాణి, మల్లికా అనిత, అమరావతి సాంస్కృతిక చైతన్య వేదిక సభ్యులు రమణ, సుధాకర్, నాగరాజు, లెనినా తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
గుంటూరు ● ఆదివారం 15 జూన్ 2025

రేవంత్ అన్నా... తగ్గేదేలే

సంధ్య థియేటర్ ఘటన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, అల్లు అర్జున్ ఒకే వేదికను పంచుకోవడం ఇదే తొలిసారి కావడం, వారిద్దరి కలయిక ఎలా ఉండబోతోందో అనే ఆసక్తిని పెంచింది. అల్లు అర్జున్‌ను రేవంత్‌రెడ్డి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. 'పుష్ప 2' చిత్రానికి గాను ఉత్తమనటుడు పురస్కారాన్ని రేవంత్‌రెడ్డి నుంచి అందుకున్నారు అల్లు అర్జున్. వ్యాఖ్యాతలు ఆయన్ను వేదికపై మాట్లాడాలని కోరడంతో అల్లు అర్జున్ మైక్ అందుకున్నారు. ముందుగా తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్‌రెడ్డి అన్న అంటూ ముఖ్యమంత్రిని సంబోధించారు. 'సినిమా ఫంక్షన్ కాబట్టి సరదాగా ఒక డైలాగ్ చెప్పొచ్చా అన్నా' అంటూ రేవంత్‌రెడ్డిని అనుమతి అడగడం, ఆయన నవ్వుతూ అనుమతిస్తున్నట్లు చేతిని ఊపడంతో 'పుష్ప 2'లోని డైలాగ్‌ను అల్లు అర్జున్ చెప్పారు.





సైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు
మణిరత్నం



బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు
సుకుమార్



నాగిరెడ్డి - చక్రపాణి అవార్డు
అట్లూరి పూర్ణచంద్రరావు



కాంతారావు ఫిల్మ్ అవార్డు
విజయ్ దేవరకొండ



రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు
యండమూరి వీరేంద్రనాథ్

"60 ఏళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం నంది అవార్డులను ప్రవేశపెట్టింది. 14 ఏళ్ల కిందట ఆగిపోయిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ కొనసాగించాలని నేడు నిర్ణయించుకున్నాం. తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులను ప్రకటించాం. ప్రభుత్వాన్ని నడిపేటప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ... మిమ్మల్ని అభిమానంగా చూసుకుంటుంది."

- రేవంత్ రెడ్డి, సీఎం



ఉత్తమ చిత్రం బాహుబలి 2
రాజమౌళి, ప్రసాద్ దేవినేని

కన్నుల పండుగగా గద్దర్ అవార్డుల వేడుక



'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2024' ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా 2024 ఏడాదికి గాను తెలుగు చలనచిత్రాలకు చెందిన వివిధ కేటగిరీల్లో విజేతలతో పాటు 2014-2023 వరకు ఉత్తమ ప్రథమ, ద్వితీయ, తృతీయ చలనచిత్రాలకు, ఉత్తమ నటీనటులు, దర్శక నిర్మాతలకు సైతం ఈ పురస్కారాలను అందించారు. 14 ఏళ్ల తర్వాత తెలంగాణ ప్రభుత్వం తెలుగు సినిమాకు ప్రాంతీయ అవార్డులు ఇచ్చింది ఈ కార్యక్రమానికి యావత్ చిత్ర పరిశ్రమ కదిలొచ్చింది. తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు, ఎండీ ఎస్. హరీష్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. రెడ్‌కార్పెట్‌పై సినీ ప్రముఖులు సందడి చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే అవార్డ్ ఫంక్షన్‌కు సంబంధించిన సావనీర్‌ను వారిద్దరూ ఆవిష్కరించారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్ మెమెంటోనూ రూపొందించిన రమావత్ నాగుల నాయక్‌ను, జ్యూరీ చైర్మన్ మురళీమోహన్, చైర్‌పర్సన్ జయసుధ, సభ్యులు కే దశరథ్, డీవీకేరాజు, ఊహ తదితరులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు ఎస్. తమన్, ఎం.ఎం కీరవాణి, గాయకులు రామ్ మిరియాల, మంగ్లీ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గద్దర్‌ను గుర్తు చేసుకుంటూ మంగ్లీ 'పొడుస్తున్న పొద్దుమీద, బండెనక బండికట్టి' పాటలు ఆలపించారు. పాతతరం కథానాయికలు జయప్రద, జయసుధ, సుహాసిని, ఒకే‌ఫ్రేమ్‌లో కనిపించి అలరించారు. భీమ్స్ సిసిరోలియో తల్లితో పాటు కలసి పురస్కారం అందుకున్నారు. ఆ సందర్భంలో ఆయన తల్లిని ముద్దాడిన దృశ్యం మనసుకు హత్తుకుంది. ముందుగా వ్యక్తిగత అవార్డ్ విభాగం ప్రధానంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ పురస్కారాలను అందజేశారు. తర్వాత రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తొలిపురస్కారాన్ని 'రజాకార్' చిత్రానికి గాను ఉత్తమ నిర్మాతగా గూడురు నారాయణరెడ్డి, దర్శకుడు యాట సత్యనారాయణకు అందజేశారు. ఉత్తమ ప్రజాధరణ చిత్రం కేటగిరిలో 'ఆయ్' చిత్రానికి గాను బన్నీ వాసు తరపున అల్లు అరవింద్ పురస్కారం అందుకున్నారు.

శుభ పరిణామం

14 ఏళ్ల తర్వాత ఈ రోజు తెలుగు సినిమా అవార్డ్ వేడుకను నిర్వహించుకోవడం శుభ పరిణామం. 2014 జూన్ 2న తెలంగాణ ఆవిర్భవించినప్పటి నుంచి జ్యూరీ ఎంపిక చేసిన చిత్రాలకు అవార్డ్ ఇవ్వడం సంతోషకరం. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ఈ రోజు ఇంత వైభవంగా నిర్వహించుకోవడానికి కారణమైన తెలంగాణ సీఎం ఎ. రేవంత్‌రెడ్డి గారికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి ధన్యవాదాలు.

- దిల్‌రాజు

నా కుటుంబం తరపున ధన్యవాదాలు

ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నందమూరి బాలకృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తెలంగాణ ప్రభుత్వం బ్రహ్మాండమైన ఉత్సవాన్ని జరుపుతోంది. గద్దరన్న తెలంగాణ ముద్దుబిడ్డ. ఆయన పేరును చిరస్థాయిగా నిలబెట్టేలా ఈ అవార్డ్‌లు ఇవ్వడం గొప్ప విషయం. అందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. 1996లో ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఇవ్వడం మొదలైంది. మధ్యలో ఆగిపోయింది. మళ్లీ పదేళ్ల తర్వాత తిరిగి ఎన్టీఆర్ అవార్డ్‌ను ఇస్తున్నందుకు నా కుటుంబం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ అవార్డ్‌కు తొలి గ్రహీతగా ఎంపికవ్వడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఈ పురస్కారంతో పాటు ఇచ్చే నగదు బహుమతిని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు రేవంత్ అన్న ఇచ్చినట్లు భావిస్తున్నాను' అని చెప్పారు.

నా బాధ్యతను పెంచింది

సినిమా పరిశ్రమను ఒకతాటిపైకి తెచ్చి గద్దరన్న పేరుతో అవార్డులు ఇవ్వడం ఆనందంగా ఉంది. కాంతారావు గారి పేరు మీద ఇచ్చే అవార్డ్‌ను స్వీకరిస్తున్న తొలి నటుడిగా నా బాధ్యతను మరింత పెంచింది. రేవంత్‌రెడ్డి గారికి ధన్యవాదాలు.

విజయ్ దేవరకొండ

2024లో ఉత్తమ చిత్రాలు



మొదటి ఉత్తమ చిత్రం: కల్కి 2898 ఏడీ - దర్శక నిర్మాతలు చలసాని అశ్వనిదత్, నాగ్ అశ్విన్



రెండో ఉత్తమ చిత్రం పొట్టేల్ - నిర్మాత ఎస్ కుమార్



మూడో ఉత్తమ చిత్రం లక్కీ భాస్కర్ - దర్శకనిర్మాత వెంకీ అట్లూరి, నాగవంశీ



రజాకార్ (బెస్ట్ పిక్చర్ ఆన్ హిస్టరీ)
నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణ



ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా-2)



దర్శకులు- సుజిత్, సందీప్ ('క')



బాలనటులు -అరుణ్‌దేవ్, హారిక (35 చిన్న కథ కాదు)



ఉత్తమ చిత్రం ఉప్పెన
నవీన్ యెర్నేని, వై. రవిశంకర్



దర్శకుడు వేణు - బలగం



అడివి శేష్ - మేజర్



జ్యూరీ చైర్మన్ మురళీమోహన్



జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ



కీరవాణి, చంద్రబోస్‌కు సత్కారం



దర్శకుడు యదువంశీ (కమిటీ కుర్రోళ్లు)

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

రేపల్లె, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మరమ్మతులు చేపడుతూ.. గేర్‌లో ఉన్న ట్రాక్టర్‌ను ఒక్కసారిగా స్టార్ట్ చేయడంతో వెనుక చక్రం కింద పడి నల్లూరు రమేష్ బాబు(45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రాజశేఖర్ వివరాల మేరకు.. నల్లూరు గ్రామంలో గ్రామస్తుడు రమేష్‌బాబు ట్రాక్టర్ మరమ్మతులు చేప డుతుండగా.. ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

అరంగేట్రం అద్భుతం

అమెరికాలో కూచిపూడి నేర్చి..
గుంటూరులో డాక్టర్ అపర్ణ నృత్య ప్రవేశం
జీజీహెచ్ వైద్యకళాశాల 'జింకానా'లో తొలి ప్రదర్శన



గుంటూరు మెడికల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ లబ్‌డబ్ అనే హృదయ ధ్వనులే వినిపించే గుంటూరు వైద్య కళాశాల జింకా నా ఆడిటోరియం శనివారం నాట్య మంజీర ధ్వనితో.. మువ్వల సందడి చేసింది. అమెరికాలో నివసిస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, శాస్త్రీయ నృత్యరీ తులను పరిరక్షించే దిశగా కృషి చేస్తున్న కూచిపూడి నాట్య కళాకారిణి డాక్టర్ అపర్ణ కంభంపాటి నృత్య రంగప్రవేశం శనివారం జింకానా ఆడిటోరియంలో వైభవంగా జరిగింది. తన తొమ్మిదవ ఏట నుం చే నృత్య శిక్షణ ప్రారంభించిన ఆమె, హౌస్టన్ నగరంలోని వేదాం తం కళాక్షేత్రం వ్యవస్థాపకులు వేదాంతం రాఘవ దగ్గర శిష్యరికం చే శారు. కూచిపూడి నృత్యంలో 17 ఏళ్ల పాటు అభ్యాసం చేశారు. ఆమె త న తొలి నృత్య ప్రదర్శన గుంటూరులో ఇవ్వడం విశేషం. పుర ప్రము ఖులు, సంగీత, సాహిత్య నిపుణుల సమక్షంలో డాక్టర్ అపర్ణ కూచిపూడి నాట్య ప్రదర్శనతో రంగప్రవేశం చేశారు. నర్తన శైలితో అందరినీ ఆక ట్టుకున్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడిన కంభంపాటి మహదేవ్, వరలక్ష్మి దం పతుల కుమార్తె అపర్ణకు నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు పీవీ హనుమంతరావు మేనమామ. టెక్సాస్ యూనిర్శిటీ నుంచి బయోకెమిస్ట్రీలో బ్యాచులర్ డిగ్రీ, డల్లాస్‌లోని యూటీ సౌత్ వెస్ట్రన్ మెడికల్ స్కూల్ నుంచి మెడిసిన్ డాక్టరేట్ (ఎండీ) పొందిన అపర్ణ చదువులోనూ ప్రతిభావం తురాలు. సంస్కృత విశ్వ విద్యాలయం ఆచార్యులు కె. విశ్వనాథశర్మ, హరికథా గాయకులు డాక్టర్ ముప్పవ రపు సింహాచల శాస్త్రి తదిత రులు అపర్ణను ఆశీర్వదించారు. తొలుత దీపారాధన, ప్రార్థనతో కార్య క్రమానికి శ్రీకారం చుట్టారు. విఘ్నాధిపతి వినాయకుడి కీర్తనతో నృత్యం ప్రారంభించారు. డీఎస్‌పి శాస్త్రి, కొలమ నూరు రాజగోపాలచారి, రామరాజు దివాకర్, ఉల్లి మురళీ, కొండా శశిధర్, జయకుమారు ఆచార్య గాత్ర, వాద్య సహకారం అందించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విశ్వనాథ శర్మ, సింహాచల శాస్త్రి తదితరులు

గుడికెళ్లే వృద్ధురాళ్లే టార్గెట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా వెళ్లే వృద్ధ మహిళలే లక్ష్యంగా వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. పొన్నూరు రోడ్డులోని ఆనందపేట ఒకటో లైన్‌కు చెందిన షేక్ అమీర్ బాషా అలియాస్ జౌహరీని అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.30 లక్షలు విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన ఎస్పీ సతీష్ కుమార్ వివరాలు వెల్లడించారు. పాత నేరస్థుడు, కార్పెంటర్ అయిన అమీర్ బాషాపై ఒక హత్య, 22 చైన్ స్నాచింగ్స్, చోరీ కేసులున్నాయని వెల్లడించారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన స్నాచింగ్ కేసు ఛేదనలో సీసీఎస్ అదనపు ఎస్పీ కె.సుప్రజ అమీర్ బాషా నిందితుడిగా గుర్తించినట్లు తెలిపారు. నిందితుడు పక్కా పథకం ప్రకారం, రెక్కీ వేసి గురువారం సాయిబాబా ఆలయానికి వెళ్లే వృద్ధ మహిళే టార్గెట్‌గా అది కూడా మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్య తాను ఎంచుకున్న ప్రాంతంలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే వాడని చెప్పారు. గతేడాది సెప్టెంబర్ 22 నుంచి మార్చి 28 వరకు కొత్తపేట, పాత గుంటూరు, లాలాపేట, అరండల్ పేట, పట్టాభిపురం, నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాని వివరించారు. 2016లో బాషాపై సస్పెక్టెడ్ షీటు తెరవడంతో.. విరామ మిచ్చి గతేడాది నుంచి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. పదేళ్లుగా చోరీ సొత్తు కొనుగోలు చేస్తున్న వారందరికీ త్వరలోనే నోటీసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. నిందితుడు అమీర్ భాషను అరెస్టు చేసిన సీసీఎస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ సతీష్ కుమార్ రివార్డులు ప్రకటించారు.

నీట్ ఫలితాల్లో 'శ్రీ చైతన్య' ప్రభంజనం



విద్యార్థులతో డీన్స్ కిశోర్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు విద్య, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు 5 వేల లోపు 41 మంది, పదివేలలోపు 83 మంది ర్యాంకులు సాధించారని ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవింద్ 13, జె. శ్రీకీర్తన 109, ఎం.రోహన్ 133, ఎస్కే నిహాల్ పర్వీజ్ 180, జి.లక్ష్మీదివ్యశ్రీ 187, సీహెచ్ రేవతి రెడ్డి 296, కె.శ్రీ వెన్నెల 847, లిడ్యా జాస్మిన్ 976 ర్యాంకులు సాధించారని తెలిపారు. గుంటూరు జోన్ నుంచి 195 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధిస్తారన్నారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, డీన్స్ కిశోర్ కుమార్, చంద్రశేఖర్, క్రిష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు, ఏజీఎం ఎల్‌టీసీ శ్రీనివాస్ అభినందించారు.

18న జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలి పర్యటన

గుంటూరు(తూర్పు),జూన్ 14(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్ ఈ నెల 18న జిల్లాలో పర్యటించ నున్నారు. ముందు రోజు గుంటూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారు. అనంతరం డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరిస్తారు. నగ రంలోని మహిళా వసతి గృహాలను సందర్శించి, మహిళా లబ్ధిదారులు, జిల్లా యంత్రాంగంతో సమావేశం నిర్వహిస్తారు. 19న విజయవాడ నుంచి తిరుపతికి వెళ్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రన్, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

విద్యుత్ ప్రైవేటీకరణకు స్మార్ట్ మీటర్లు వారధి

గుంటూరు(తూర్పు), జూన్ 14(ఆంధ్ర జ్యోతి): విద్యుత్ రంగం ప్రైవే టీకరణకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు వారధి అని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కోశాధికారి ఎస్. రాజేంద్రన్ పేర్కొన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎం ప్లాయిస్ యూని యన్ (యూఈఈయూ) రాష్ట్ర 11వ మహా సభలు గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభమయ్యాయి. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.సూరిబాబు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో రాజేంద్రన్ మాట్లాడుతూ విద్యుత్ రంగంపై కేంద్రం పెత్తనం పెరిగిం దని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, ప్రైవేటీ కరణ విధానాలు అనుసరిస్తోందన్నారు. ప్రైవే టు సంస్థల వద్ద విద్యుత్ కొను గోలు చేయా లని తెస్తున్న ఒత్తిడి ఫలితంగా.. అధిక ధరకు కొనుగోలు చేసిన రాష్ట్రాలు అప్పులపాలవుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, సీహెచ్ నర్సింగరావు, యునైటెడ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి ముజఫర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు.. వైసీపీకి చెంపపెట్టు

● మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి, జూన్14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలు చేయడం వైసీపీకి చెంపపెట్టుగా మిగిలిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శనివారం తెనాలి క్యాంపు కార్యాలయంలో మంత్రి మనోహర్ విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి పట్టంగట్టిన ప్రజల్లో సూపర్ సిక్స్ అమలుతో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ఈ పథకాలు అమలు చేయలేరన్న వైసీపీకి ఇప్పుడు వణుకు పుడుతోందన్నారు. పేద మహిళలు కూడా గ్యాస్ పొయ్యితో వంట చేసుకునేలా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం పేరుతో బిడ్డల చదువుకయ్యే ఖర్చును ప్రభుత్వమే బరించేలా పథకాన్ని రూపొందించి పారదర్శకంగా అమలు చేస్తున్నామని, ఇందుకు రాష్ట్రంలో 67.37లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,191 కోట్లు జమ చేశామని చెప్పారు. విద్యాలయాల్లో మంచి చదువుతో పాటు పౌష్టికాహారం అందించేలా సన్న బియ్యంతో ఆహారం అందిస్తున్నామని, మంత్రి లోకేశ్ పిల్లలకు అందించే పుస్తకాలు, బ్యాగులు సైతం నాణ్యతా ప్రమాణాలతో కూడినవని మంత్రి మనోహర్ వివరించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఒక్క బిడ్డకే సాయం అని చెప్పి వాటిని కూడా పారదర్శకంగా అందించక లేకపోయిందని విమర్శించారు. బటన్ నొక్కి డబ్బులు జమవుతున్నాయంటూ ఆనాడు వైసీపీ ఆర్భాటపు సభలు పెట్టడం తప్ప ప్రజలకు చేసిన మంచి లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ఎక్కడా కూడా హడావిడి చేయకుండా కూటమి ప్రభుత్వం మంచి వాతావరణంతో సూపర్ సిక్స్ అమలు చేస్తూ నేడు తల్లుల ఖాతాలో నగదు జమచేసి మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నామన్న సంతృప్తిని కలిగించిందని మనోహర్ పేర్కొన్నారు.

వైసీపీ విమర్శలు దివాళా కోరుతనానికి నిదర్శం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంపై వైసీపీ విమర్శలు వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని.. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మండిపడ్డారు.ఒక్క రోజులో 67.27 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10.091 కోట్లు జమచేయడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని హ ర్షం వ్యక్తం చేశారు. ఇంత పెద్దఎత్తున, పారదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకంపై వైసీపీ నేతలు, జగన్ విమర్శలు ఆశ్చ ర్యాన్ని కలిగిస్తున్నాయని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తల్లికి వందనం అర్హతా ప్రమాణాలు గతంలో వైసీపీ ప్రభుత్వం నిర్దేశిం చినవే అని, కూటమి ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా పెంచిందన్నారు.

నైపుణ్యవంతులుగా 'కిట్స్' విద్యార్థులు

● కృష్ణా వర్సిటీ వీసీ డాక్టర్ రామ్ జీ కోన



ఇంజనీరింగ్ పట్ట భద్రులకు పట్టాలు పంపిణీ చేస్తున్న వైస్ చాన్సలర్ రామ్ జీ కోన

వట్టిచెరుకూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దుతూ.. క్రమశిక్షణకు కిట్స్ కళాశాల అత్యంత ప్రాధాన్యమిస్తోందని కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ రామ్‌జీ కోన పేర్కొన్నారు. వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో శనివారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ రామ్ జీ కోన, జేఎన్‌టీయూకే నరసరావుపేట ప్రొఫెసర్ డాక్టర్ కె.శోభన్‌బాబు పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు అధ్యక్షత వహించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు పట్టభద్రులైన విద్యార్థులతో తమ విధులు సక్రమంగా నిర్వహిస్తూ..ఆదర్శ ప్రాయంగా నిలుస్తామని ప్రమాణం చేయించారు. 2021 - 2025 విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్ పట్ట భద్రులకు రామ్‌జీ కోన, శోభన్ బాబు, చైర్మన్ కోయ సుబ్బారావు, సెక్రటరి కోయ శేఖర్ పట్టాలు ప్రదానం చేశారు.

ఐఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఎస్‌ఆర్‌ఎం ఫస్ట్



మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ

మంగళగిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఉన్నత విద్యాసంస్థలు ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ ఇనిస్టి ట్యూషనల్ ర్యాంకిం గ్ ఫ్రేమ్ వర్క్ (ఐఐఆర్‌ఎఫ్)-2025లో ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ అగ్రస్థానంలో నిలిచింది. న్యూ ఏజ్ ఎమర్జింగ్ యూనివర్సిటీ కేటగిరిలో ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకుంది. బోధన, పరిశోధన, పరిశ్రమల ఏకీకరణ, ప్లేస్‌మెంట్స్‌లో ప్రగతి, భవిష్యత్తు దిశానిర్దేశం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఐఐఆర్‌ఎఫ్ దేశంలోని యూని వర్సిటీలు, పరిశోధన సంస్థలు, ఉన్నత విద్యా సంస్థలకు ఏటా వివిధ కేటగిరిల్లో ర్యాంకులను ప్రకటిస్తుంది. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి జాతీయ సౌత్ జోన్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును కేటాయించింది. బెస్ట్ న్యూఏజ్ ఎమర్జింగ్ యూనివర్సిటీగా ఏపీ ఎస్‌ఆర్‌ఎం జాబితాలో పొందుపర్చింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

రూ.33 లక్షలతో నర్సింగ్ కాలేజీకి బస్సు అందజేత

● తులసీ ప్రభును సన్మానించిన పెమ్మసాని, నసీర్

గుంటూరు మెడికల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు 13 ఏళ్లుగా ఎదురు చూస్తున్న కాలేజీ బస్సును పారిశ్రామికవేత్త తులసీ రామచంద్ర ప్రభు విరాళంగా అందజేయడం అభినందనీయమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కొనియాడారు. అమరావతి రోడ్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థినుల కోసం తులసీ ప్రభు రూ.33 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 55 సీట్ల సామర్థ్యం గల బస్సును శనివారం విరాళంగా కాలేజీకి అందజేశారు. కేంద్ర మంత్రి పెమ్మసాని, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో నర్సింగ్ కాలేజీకి బస్సు అవసరం ఉందని తెలియజేయగా, తులసీ ప్రభు వెంటనే స్పందించి బస్సును విరాళంగా అందించడం ఆయన సేవా గుణానికి, దాతృత్వానికి నిదర్శనమని పెమ్మసాని ప్రశంసించారు. ఈ బస్సు ద్వారా 230 మంది నర్సింగ్ విద్యార్థినులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా తులసీ ప్రభును పెమ్మసాని, నసీర్ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తులసీ యోగేష్, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ సజీల, నర్సింగ్ కాలేజీ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, తులసీ ప్రభు

కార్మికుల దగ్గర అనధికార వసూలు జరగకూడదు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేష న్, జూన్ 14 (ఆంధ్ర జ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని శానిటరీ డివిజన్ల వారీగా ప్రజా రోగ్య కార్మికుల దగ్గర అనధికారిక నగదు వసూ ళ్లు జరగకూడదని, చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు స్పష్టం చేశారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పారి శుధ్యం నిర్వ హణపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ, గుంటూరు నగరాన్ని బిన్ ఫ్రీ సిటీగా చేయడానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కృషి చేయా లన్నారు. రానున్న 15 రోజుల్లో నగరంలో పారిశుధ్యం మెరుగుపడకపోతే చర్యలు తీసుకుంటామని, పారిశుధ్య పనుల పర్యవేక్షణకు సోమవారం నుంచి ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారన్నారు. వారి పర్యటనలో పారిశుధ్య పనుల నిర్వహణపై అశ్రద్ధ వహించినా, పారిశుధ్య కార్మికులు గైర్హాజరును గుర్తిస్తే తీవ్ర చర్యలు తీసుకుంటా మన్నారు. నగరంలో పారిశుధ్యం మెరుగుదలకు శానిటరీ ఇన్స్పెక్టర్లకు అవసరమైన కార్మికులను, చెత్త తరలింపు ట్రాక్టర్లను అందజేస్తామని తెలిపారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎస్ఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

డేటాను ఒకే ఫార్మాట్‌లో సమీకరించాలి

● ఐఐటీ మద్రాస్‌లోని సీఎస్‌ఈ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాసకుమార్



మాట్లాడుతున్న ఆచార్య పి.శ్రీనివాసకుమార్

గుంటూరు(విద్య), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వివిధ వనరుల నుంచి వచ్చిన డేటాను ఒకే విధా నంలో సమీకరించడానికి ఆన్‌టాల జీలు ఉపయోగపడతాయని మద్రాస్ ఐఐటీ సీఎస్‌ఈ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మాటిక్స్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో "సెకండ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నెట్‌వర్క్స్ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్ శనివారం ముగిసింది. ముఖ్య అతిథి ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసకుమార్ మాట్లాడు తూ ఏఐ సిస్టంలు ఒక నిర్దిష్ట పరిసరంలో అర్థం చేసుకోవడం, నిర్ణయం తీసుకోవడం లేదా సహాయపడే విధంగా రూపొందించడంలో ఆన్‌టాల జీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథి జైపూర్ ఎంఎన్ఐటీ సీఎస్ఈ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌బాబు బత్తుల మాట్లాడుతూ ఏఐ ఆధారిత వ్యవస్థలు బ్యాంకింగ్‌లో వినియోగ దారుల ప్రవర్తనలను విశ్లేషించి అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించగలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐటీ సిల్‌చార్ అసోసి యేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుగన్య దేవి, ఎన్ఐటీ వరంగల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యూఎస్ఎన్ రాజు, మైక్రోసాఫ్ట్ సీనియర్ సాఫ్టేవేర్ ఇంజినీర్ ఆదిత్య సాలాది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఐ పథకాలపై అవగాహన, ప్రచారం అవసరం

● ప్రాంతీయ రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరావు

గుంటూరు(విద్య), జూన్ 14(ఆంధ్రజ్యోతి): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా అమలవుతున్న పథకాలు, లోన్లు, సబ్సిడీ బ్యాంక్ అకౌంట్స్ అమలు తీరుపై గిరిజన గ్రామీణ, విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడం స్వచ్ఛంద సంస్థలపై బాధ్యత ఎంతగానో ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు అన్నారు యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ అండ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ(ఏఐఆర్‌టీడీఎస్), సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ (ఆర్టిడ్స్) సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ, గిరిజన విద్యార్థులకు, యువతకు 'డిపాజిటర్స్ ఎడ్యుకేషన్' పై జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న మరొక రిసోర్స్ పర్సన్ కౌన్సిలర్ ఆర్ఎస్ శంకరరావు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ పథకాలు, పొదుపు ఖాతాలు, బ్యాంక్ అకౌంట్స్ నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సదస్సులో ఎర్రు సాంబశివరావు, ఏఐఆర్టీడీఎస్ అధ్యక్షులు పి.విజయలక్ష్మి, కో ఆర్డినేటర్ షేక్ హుస్సేన్, విద్యార్థినీ, విద్యార్థులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీనివాసరావు

ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు రాకూడదు

● ప్రత్యామ్నాయ రాకపోకలకు సిద్ధం చేయాలి

● నగర పర్యటనలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు కార్పొరేషన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరానికి కీలకమైన శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు అతి త్వరలో ప్రారంభం కానున్నందున ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ రహదారులను సిద్ధం చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శంకర్ విలాస్ ఆర్వోబీకి ప్రత్నామ్యాయ రహదారుల పరిశీలనలో భాగంగా శనివారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు నసీర్ అహ్మద్, జీఎంసి అధికారులతో కలిసి ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి రెడ్డిపాలెం రోడ్, సంజీవయ్య నగర్ గేటు నుంచి నెహ్రూ నగర్ గేటు వరకు, మూడు వంతెనలు, శారదా కాలనీ రోడ్డు, కంకరగుంట ఆర్‌యూబీ, కృష్ణ నగర్ రోడ్డులను పరిశీలించారు.

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ వంతెన పనులు జరుగుతున్న కాలంలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలు రహదారులను జీఎంసి అభివృద్ధి చేసిందన్నారు. సంజీవయ్య నగర్ గేటు నుండి నెహ్రూ నగర్ గేటు వరకు ప్రస్తుతం జరుగుతున్న పైప్ లైన్ మరమత్తు పనులు పూర్తి చేసి రోడ్ ఏర్పాటు చేయాలని కమిషనర్ కి తెలిపారు. 3 వంతెనెల వద్ద రైల్వే అధికారులతో సమన్వయం చేసుకొని, వర్షాలకు మురుగు నిల్వకుండా శాశ్వత ప్రాతిపదికన డ్రైన్ నిర్మాణ చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ గుంటూరు నగరానికి శంకర్ విలాస్ వంతెన కీలకమని, వంతెన పనులు ప్రారంభానికి ముందే ప్రత్యామ్నాయ రాకపోకల మార్గాలను జీఎంసి నుండి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆయా మార్గాల్లో ట్రాఫిక్‌కి అడ్డంకి లేకుండా ఆక్రమణల తొలగింపునకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.



మూడు వంతెనల వద్ద డ్రెయిన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్, కమిషనర్

కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే ప్రధాన రోడ్ల మరమ్మతులు చేపడుతున్నామన్నారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబికి ప్రత్యామ్నాయ రోడ్లను కూడా ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తామన్నారు. రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే జీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది ప్రజా సౌలభ్యం దృష్ట్యా తొలగిస్తారన్నారు.

తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు నసీర్ మాట్లాడుతూ శంకర్‌విలాస్ ఆర్వోబీకి మూడు వంతెనల మార్గం అతి ముఖ్యమైన ప్రత్యామ్నాయ మార్గమని, ఈ మధ్యకాలంలో కురిసిన వర్షాలకు నీరు నిలిచి సదరు ప్రాంతం ఇబ్బందిగా మారిందన్నారు. అరండల్ పేట నుంచి వచ్చే మురుగు మూడు వంతెనల వద్దకు రాకుండా బుచ్చయ్యతోటవైపు వెళ్లేలా కల్వర్ట్, బొంగరాలబీడు 1వ లైన్ నుంచి బుచ్చయ్యతోటలోకి కనెక్ట్ అయ్యేలా మేజర్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పర్యటనలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నేడు అగతవరప్పాడులో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వంద పడకల సామర్థ్యంతో గుంటూరులోని అతి పెద్ద ఆయుర్వేదిక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటలైన శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం అగతవరప్పాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ఎండీ, ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు అనుభవజ్ఞులైన పంచకర్మ వైద్యనిపుణులు రోగులకు నాడీ పరీక్షించి కీళ్ల నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటిక, పక్షవాతం, మోకాళ్ల అరుగుదల, ఆస్మా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మవ్యాధులు, సోరియాసిస్, పైల్స్, హెచ్ఐవీ/ఎయిడ్స్, వెన్నుపూస సంబంధిత వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఉచితంగా మందులు ఇస్తారని ఆయన వివరించారు. అగతవరప్పాడులోని జెడ్పీ పాఠశాలలో ఆదివారం జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు వినియోగించుకొని వైద్యసేవలతో పాటు బీపీ, షుగర్ తదితర వ్యాధులకు ఆయుర్వేద మందులు పొందాలని డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు కోరారు.

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షలను ఆంధ్రాబ్యాంకు విశ్రాంత మేనేజర్ నన్నపనేని వెంకటేశ్వరరావు ప్రకటించారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో కమ్మజనసేవ సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు శనివారం చెక్కును అందజేశారు. దాత మాట్లాడుతూ తన భార్య సీతామహాలక్ష్మి, కుమారుడు రాజ సురేష్ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేస్తున్నట్లు చెప్పారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ వసతి గృహాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, మర్రిపూడి సీతారామయ్య, మర్రిపూడి సీతారామయ్య, వడ్లమూడి శివరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న నన్నపనేని వెంకటేశ్వరరావు

17న పాలస్తీనా సంఘీభావ దినోత్సవం

గుంటూరు(తూర్పు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ చేపట్టిన మారణహోమాన్ని ఖండిస్తూ, వామపక్షాలు ఆధ్వర్యంలో ఈ నెల 17న పాలస్తీనా సంఘీభావ దినోత్సవాన్ని జరుపుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజాలో జరిగిన దాడుల్లో ఇప్పటి వరకు 55 వేల మందికిపైగా పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు, శరణార్థుల ఆశ్రయాలపై దాడి చేయడం మానవత్వానికి వ్యతిరేకమని అన్నారు. సీపీఎం, సీపీఐ(ఎంఎల్) నాయకులు నళినికాంత్, ఎన్.విష్ణు మాట్లాడుతూ ఇజ్రాయెల్‌తో ఉన్న సైనిక భద్రతా ఒప్పందాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. సంఘీభావ దినోత్సవంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పాలస్తీనాకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో కోట మాల్యాద్రి, ఎ.అరుణ్‌కుమార్, మన్నవ హరిప్రసాదు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పాల్గొన్న వామపక్ష పార్టీ నాయకులు

చెగువేరా స్ఫూర్తితో పోరాటాలు

గుంటూరు (తూర్పు), జూన్ 14(ఆంధ్రజ్యోతి): చెగువేరా స్ఫూర్తితో విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ అన్నారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శనివారం చెగువేరా 97వ జయంతి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన ఉద్యమం గొప్పదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంలో చేపట్టిన వ్యతిరేక విధానాలపై పోరాడటమే ఆయనకిచ్చే ఘన నివాళలని అన్నారు. కార్యక్రమంలో యశ్వంత్, ప్రణీత్, అజయ్, సాయి గణేష్, వెంకట భాస్కర్, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.



చెగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



పూజలలో పాల్గొన్న పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

వైభవంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్వీఎస్ కాలనీ, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చక్రస్నానం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముగింపు ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షుడు వట్టికూటి పూర్ణచంద్రరావు, సభ్యులు నల్లమోతు వెంకట రతయ్య, డాక్టర్ పుచ్చా వెంకట మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య జయంతి

గుంటూరు(తూర్పు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై పదకవితా పితామహుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య 617వ జయంతి ఉత్సవం వీనుల విందుగా జరిగింది. సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గుండె నిపుణుడు డాక్టర్ కంటి రఘు, మైథిలి దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాలను ప్రారంభించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ పుర స్కార గ్రహీత బ్రహ్మశ్రీ మల్లాది సూరిబాబును ఘనంగా సత్కరించారు. అనంతరం మల్లాది సోదరులు శ్రీరామప్రసాదు, రవికుమార్ విజయవాడ వారు శాస్త్రీయ సంగీత గాత్ర యుగళ కచేరీలో అన్నమయ్య కీర్తనలను శ్రా వ్యంగా ఆలపించి సంగీతా భిమానులను అలరించారు. వీరికి వయోలిన్ పై సింధూరాగేశ్వరి, మృదంగంపై అరవింద్ కార్తీక్, ఘటం ఎం.హరిబాబు చక్కటి వాయిద్యానికి సహకరించారు. కార్యక్రమాల్ని గాయత్రీ మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, శేమరాణి పర్యవేక్షించారు.



అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తున్న మల్లాది సోదరులు

వైభవంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లారెడ్డినగర్, శ్రీ విఘ్నేశ్వరస్వామి సహిత శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం గోపూజ, గురుప్రార్థన, మండపారాధన, వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీ రామలింగేశ్వరస్వామికి ఆలయ అర్చకులు వేద ఘోషతో పంచామృతాలతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం రుద్రహోమం, నవగ్రహ, మండప దేవత హోమాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ ఛైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, సభ్యులు గుంటూరు వేమారెడ్డి, కొండారెడ్డి పర్యవేక్షించారు.




ప్రత్యేక అలంకరణలో స్వామి

మంత్రి లోకేశ్‌పై ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా!

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లుల సంతోషమే కూటమి ప్రభుత్వానికి ఆశీర్వాదమని, తల్లికి వందనం నిధులు జమతో రాష్ట్రంలో సంతోషాలు వెల్లివిరిశాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో తల్లికి వందనంపై శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలోనే ఎంత మందుంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని చెప్పారు. ఒక ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్నా ఒకరికి మాత్రమే చదువుకోవాలని చెప్పడం గత వైసీపీ ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని విమర్శించారు. తల్లికి వందనం నిధుల్లో రూ.2000 నారా లోకేష్ అకౌంట్లోకి వెళ్లాయని విమర్శించడం వైసీపీ చౌకబారు విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. అది నిరూపిస్తే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే నసీర్ సవాల్ చేశారు. కేవలం తల్లికి వందనమే కాదని, ప్రభుత్వ పాఠశాలలో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. రాధాకృష్ణన్ విద్యార్థి కిట్ల పంపిణీ ద్వారా విద్యా ప్రగతికి బాటలు వేశామన్నారు.



తల్లికి వందనం లబ్దిదారులతో ఎమ్మెల్యే నసీర్

'తల్లికి వందనం' పేద విద్యార్థులకు వరం

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సురేష్ కుమార్

గుంటూరు సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం పేద విద్యార్థులకు వరం వంటిది అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గుంటూరులో శనివారం ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఎంత మంది ఉన్నా అందరికీ పథకం వర్తింపు చేయటం సీఎం చంద్రబాబుకు పేదలపై ఉన్న అభిమానానికి నిదర్శనం అని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం కూడా అదే రీతిలో హామీ ఇచ్చినా అమల్లోకి వచ్చే నాటికి మాట తప్పారని గుర్తు చేశారు. నిజంగా మాట తప్పని మనిషి సీఎం చంద్రబాబు నాయుడు అని నిరూపించుకున్నారని డాక్టర్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ పథకం గురించి నిన్నటి దాకా ఇష్టం వచ్చినట్లు మాట్లాడిన వైసీపీ నేతలు ఇప్పుడు ఏం చెబుతారని ఆయన ప్రశ్నించారు.

విమాన ప్రమాదం.... బాధాకరం : వల్లూరి

గుంటూరు(తూర్పు), జూన్ 14(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం అత్యంత బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ అన్నారు. స్థానిక చంద్రమౌళి నగర్‌లో ఆయన కార్యాలయంలో విమాన ప్రమాదంలో చనిపోయిన వారికి బీజేపీ నాయకులు సంతాపాన్ని ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాదం యావత్ జాతిని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ప్రయాణికులు, సిబ్బంది, విదేశీయులు, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ చనిపోవడం మనస్సును కలిచివేసిందన్నారు. ఇటువంటి పరిస్థితులో కేంద్రానికి మద్దతుగా నిలిచి మృతుల కుటుంబాలకు బాసటగా నిలవాలని కోరారు. ఈ ఘటనపై రాజకీయాలు చేయడం దురదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కుమార్‌గౌడ్, గంగాధర్, ఈదర శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాసరావు, వెంకటేష్ యాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విజయ్ రూపాని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తల్లికి వందనం మున్సిపల్ కార్మికులకు వర్తింప చేయాలి : సీపీఐ

గుంటూరు కార్పొరేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులందరికీ వర్తింపజేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. 9వ శానిటరీ డివిజన్ కార్యాలయం వద్ద శనివారం కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలో ఒకటైన తల్లికి వందనంలో చదువుకుంటున్న పిల్లలందరికీ ఇస్తున్నామన్నారని, కానీ మున్సిపల్ కార్మికుల పిల్లలకు ఇవ్వకపోవడం సరైనది కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను అర్హులుగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు చినబోతుల వెంకట్రావు, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి వెంకట్రావు, కోశాధికారి కోటి వీరాంజనేయులు, డివిజన్‌లోని కార్మికులు పాల్గొన్నారు.

ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా తరగతులు

గుంటూరు(తూర్పు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెలవారి యోగా శిక్షణలో భాగంగా శనివారం పలకలూరులోని విజ్ఞాన్ నిరులా కళాశాల విద్యార్థినులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇషా గుంటూరు కేంద్ర ప్రతినిధి సాంబశివరావు నేతృత్వంలో యోగా ప్రాథమికాలు, శ్వాస నియంత్రణ, శారీరక ఆరోగ్యం, మానసిక స్థితిస్థాపకతపై శిక్షణ ఇచ్చారు. తరగతుల్లో దాదాపు 850 మంది విదార్థులు పాల్గొన్నారన్నారు. ప్రభుత్వ సహకారం, సద్గురు మార్గదర్శనంతో ఈ తరగతులు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.



యోగా తరగతుల్లో పాల్గొన్న విజ్ఞాన్ నిరులా కళాశాల విద్యార్థినులు

రక్తదానం చేసి ప్రాణాలను నిలపండి



మంగళగిరి సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను నిలిపేందుకు ముందుకు రావాలని ఎయిమ్స్ వైద్యులు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది, వైద్య విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. రోగులు, రోగి బంధువులతో సమావేశం నిర్వహించి రక్తదానంపై అవగాహన పెంపొందించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో డాక్టర్ అహెంతెం శాంతాసింగ్, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీమంత కుమార్‌దాస్, ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దేసు రామమోహన్, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఎయిమ్స్ వైద్య విద్యార్థులు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

పెదనందిపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్నపర్రులో కేఎస్ఆర్ జిల్లాపరిషత్ పాఠశాలలో కొల్లా కొండలరావు హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రేయాస్, డీవీసీ, రమేష్, పవన్‌న్యూరో హాస్పిటల్స్ వారి సహకరారంతో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్యాంపు నిర్వాహకులు డాక్టర్ కొల్లా వంశీకృష్ణ శనివారం తెలిపారు. ఈ శిబిరంలో థైరాయిడ్, బీపీ, రక్త, గుండె, ఊపిరితిత్తులు, కంటి సంబంధిత వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగించుకోవాలని వంశీకృష్ణ తెలిపారు.

పశుసంవర్ధక శాఖ ఏడీఏగా సుగణ్యరావు


సుగణ్యరావు

ప్రత్తిపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పశుసంవర్ధక శాఖ ఏడీగా డాక్టర్ కట్టా సుగణ్యరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరెడ్డి బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా మద్దిపాడు నుంచి కట్టా సుగణ్యరావు నియమితులయ్యారు.

ఆలయ ఈవోగా జక్కా శ్రీనివాస్


జక్కా శ్రీనివాస్

కాకుమాను, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన స్వయంభు శ్రీ పోలేరమ్మ ఆలయ కార్యనిర్వహణ అధికారిగా జక్కా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఆలయ ఈవోగా పని చేసిన బత్తుల సురేష్‌బాబు బదిలీల్లో భాగంగా ఫిరంగిపురం వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఈవోగా బాధ్యతలు స్వీకరించిన జక్కా శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బదిలీపై వెళ్తున్న బత్తుల సురేష్‌బాబును ఘనంగా సత్కరించారు.

వేతనాల పెంపు కంటి తుడుపు చర్య

మంగళగిరిసిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు వేతనాలు పెంచుతున్నట్టు చేనేత మంత్రి సవిత ప్రకటించడం కేవలం కంటి తుడుపు చర్య మాత్రమేనని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ విమర్శించారు. పాలక ప్రభుత్వాలు చేనేత సహకార సంఘాలకు చెల్లించవలసిన యార్న్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేటు కింద చెల్లించవలసిన రూ.156 కోట్లు, త్రిఫ్టు ఫండ్ రూ.5 కోట్లు విడుదల చేయక పోవడంతో సహకార సంఘాలు కార్మికులకు పని చూపించలేకపోతున్నాయని తెలిపారు. ఇప్పటికే సహకార సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న కాల పరిమితి అయిపోవడంతో సహకార సంఘాలకు బ్యాంకుల్లో అప్పులు పుట్టక సహకార వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైపోయిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బకాయిల గురించి మాట్లాడకుండా వేతనాలు పెంచుతున్నట్టు ప్రకటించడం కంటి తుడుపు చర్య తప్ప మరోటి కాదన్నారు. ప్రభుత్వం వెంటనే రూ. 156 కోట్ల బకాయిలు, త్రిఫ్టు ఫండ్ కింద ఇవ్వవలసిన రూ.5 కోట్లు విడుదల చేయాలని, సహకార సంఘాల్లో ఉన్న క్యాష్ క్రెడిట్ మొత్తం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

29న రత్నాలచెరువులో వైద్య శిబిరం

మంగళగిరిసిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన మంగళగిరి రత్నాలచెరువులో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్ తెలిపారు. ప్రజారోగ్య వేదిక మంగళగిరి రీజియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య శిబిరంలో అన్ని రంగాల వైద్యులు పాల్గొని ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని మంగళగిరి ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. జూలై ఒకటో తేదీన డాక్టర్ డే వేడుకలను మంళగిరి పట్టణంలోని వైష్ణవి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య వేదిక రీజియన్ కార్యదర్శి ఏ జయరాజు, ఎస్ బాలకృష్ణ, వీవీ ప్రసాద్, ఎం రవి, పీ బాలకృష్ణ, బీ సుందరరెడ్డి, డీ నాగమణి, పీ ఐజాక్, వీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డేటాను ఒకే ఫార్మాట్‌లో సమీకరించాలి

● ఐఐటీ మద్రాస్ సీఎస్ఈ ప్రొఫెసర్ పీ.శ్రీనివాసకుమార్

గుంటూరు(విద్య), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వివిధ వనరుల నుంచి వచ్చిన డేటాను ఒకే విధానంలో సమీకరించడానికి ఆన్‌టాలజీలు ఉపయోగపడతాయని మద్రాస్ ఐఐటీ సీఎస్ఈ ప్రొఫెసర్ పీ.శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మాటిక్స్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో "సెకండ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నెట్‌వర్క్స్ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్ శనివారం ముగిసింది. ముఖ్యఅతిథి ప్రొఫెసర్ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ ఏఐ సిస్టంలు ఒక నిర్దిష్ట పరిసరంలో అర్థం చేసుకోవడం, నిర్ణయం తీసుకోవడం లేదా సహాయపడే విధంగా రూపొందించడంలో ఆన్‌టాలజీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మరో ముఖ్యఅతిథి జైపూర్ ఎంఎన్ఐటీ సీఎస్ఈ అసోసియేట్ ప్రొఫెసర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

కొండవీటి వాగు తూటుకాడ మయం

● నీటి పారుదలకు అడ్డుగా మారిన తీరు
● పంటపొలాల్లోకి చేరుతున్న వరదనీరు
● చివరి భూములకు అందని సాగునీరు

తాడికొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కొండ వీటి వాగులో తూటుకాడ దట్టంగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. తాడికొండ మండలం లాం చప్టా వద్ద ఉన్న కాల్వ, చెరువులో తూటు కాడ దట్టంగా పెరిగింది. వర్షాకాలంలో వరద నీరు సక్రమంగా పారుదల లేక పోవటం వల్ల పంట పొలాల్లోకి చేరుతుంది. నాగార్జునసాగర్ కాల్వ నీరు విడుదల సమయంలో నీటి ప్రవాహనికి కాల్వల్లో అడ్డుగా తూటుకాడ ఉంది. నీటి ప్రవాహం తగ్గటంతో చివరి భూములకు నీరు అందని పరిస్థితి ఉంది. దీంతో పంటలకు నీరు సక్రమంగా అందటం లేదని రైతులు వాపోతున్నారు. లాం చప్టాకు రెండు వైపులా తూటుకాడ దట్టంగా పెరిగి ఉన్నది. నీటి ప్రవాహం కూడా తక్కువగా ఉండటం వల్ల తాడికొండ వైపు వచ్చే నీరు సక్రమంగా అందటం లేదని రైతులు వాపోతున్నారు.


లాంలోని కొండవీటి వాగు కాల్వలో పెరిగిన తూటుకాడ

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే సంక్షేమ పథకాలు


కోతివానిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహవిష్కరణలో పాల్గొన్న టీడీపీ నేతలు

కాకుమాను, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సంక్షేమ పథకాలకు ఆద్యుడని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ నువ్వుల సునీల్‌చౌదరి అన్నారు. మండలపరిధిలోని కోతివానిపాలెంలో శనివారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ జరిగింది. విగ్రహ దాత హైదరాబాద్ మాజీ కార్పొరేటర్ మంచికలపూడి భానుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న సంగండెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి మాట్లాడుతూ ఎన్టీఆర్ కీర్తి అజరామం అన్నారు. క్రమశిక్షణకు మారుపేరైన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణపై హర్షం వ్యక్తం చేశారు. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ నువ్వుల సునీల్‌చౌదరి మాట్లాడుతూ దేశంలో మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించిన ఎన్టీఆర్ చిరస్మరణీయుడన్నారు. ప్రతి కార్యకర్త ఎన్టీఆర్ స్ఫూర్తితో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్ మాట్లాడుతూ పేదలైన వృద్ధులకు పెన్షన్‌లు అమలు చేసింది ఎన్టీఆరే అని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఒక యూనివర్సిటీ అని ఆ పార్టీ ఎంతో మంది మేధావులను రాష్ట్రానికి అందించిందని వివరించారు. గ్రామ సర్పంచ్ కామేపల్లి పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యపాన నిషేధం, జనతా వస్త్రాలు, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని వాటిని అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌దే అన్నారు. మండల వ్యవస్థ తీసుకువచ్చి పాలనను ప్రజల ముందకు ఉంచారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్నారన్నారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ విగ్రహవిష్కరణ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం కార్యక్రమం ఆహుతులను ఎంతగానో అలరించింది. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లమోతు పూర్ణచంద్రరావు, కామేపల్లి వెంకటేశ్వరరావు, చెన్నుపాటి రామకృష్ణ, పెద్ది రవీంద్రబాబు, జంగా మాణిక్యరావు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం పదిలం : మిల్లెట్ రాంబాబు


చిరు ధాన్యాల వినియోగం ఆవశ్యకతపై ప్రసంగిస్తున్న మిల్లెట్ రాంబాబు

వట్టిచెరుకూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ప్రజలు వివిధ కారణాలతో అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఇందుకు ప్రధాన కారణం మన ఆహార అలవాట్లేనని చిరుధాన్యాల నిపుణుడు మిల్లె రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలో రైతు నేస్తం ఫౌండేషన్‌లో కర్షక సేవాకేంద్రం నిర్వాహణలో జరుగుతున్న మూడు రోజుల రైతు శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం మొదటి రోజు చిరుధాన్యాల ప్రాముఖ్యం - చిరు ధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందనే అంశంపై మిల్లెట్ రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మురుగునీరు పోయే దారేది..

● అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
● నివాసాల మధ్యే మురుగునీరు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఒకటో వార్డులో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పెదనందిపాడు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పెదనందిపాడులో పారిశుధ్య నిర్వహణ రోజురోజుకు అధ్వానంగా మారుతుంది. స్థానిక 1వ వార్డులో ప్రధాన రహదారిపై కొద్దిపాటి వర్షానికే సైడు కాలువలు సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. అటుగా వెళ్లాలంటే పాదాచారులు దుర్గంధం, దుర్వాసనలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురుగునీటి ద్వారా దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడతామేమోనని గ్రామస్థులు ఆందోళన చెంతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఆ నీరంతా అక్కడికి చేరి మడుగును తలపిస్తుందని, దీనిపై పలుమార్లు పంచాయతీ, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలనకు ప్రత్యేక చర్యల చేపట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం పెదనందిపాడులో అధికారుల నిర్లక్ష్యంతో అభాసుపాలవుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు పారుదలకు చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.33 లక్షలతో నర్సింగ్ కాలేజీకి బస్సు అందజేత

● తులసీ ప్రభును సన్మానించిన మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, పారిశ్రామికవేత్త తులసీ ప్రభు

గుంటూరు మెడికల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు 13 ఏళ్లుగా ఎదురు చూస్తున్న కాలేజీ బస్సును పారిశ్రామికవేత్త తులసీ రామచంద్ర ప్రభు విరాళంగా అందజేయడం అభినందనీయమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కొనియాడారు. అమరావతి రోడ్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థినుల కోసం తులసీ ప్రభు రూ.33 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 55 సీట్ల సామర్థ్యం గల బస్సును శనివారం విరాళంగా కాలేజీకి అందజేశారు. కేంద్ర మంత్రి పెమ్మసాని, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో నర్సింగ్ కాలేజీకి బస్సు అవసరం ఉందని తెలియజేయగా, తులసీ ప్రభు వెంటనే స్పందించి బస్సును విరాళంగా అందించడం ఆయన సేవా గుణానికి, దాతృత్వానికి నిదర్శనమని పెమ్మసాని ప్రశంసించారు. ఈ బస్సు ద్వారా 230 మంది నర్సింగ్ విద్యార్థినులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా తులసీ ప్రభును పెమ్మసాని, నసీర్ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తులసీ యోగేష్, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ సజీల, నర్సింగ్ కాలేజీ అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్ షిప్‌లకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

ప్రత్తిపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌లకు మండలంలో ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రత్తిపాడు ఎంఈవో రమాదేవి తెలిపారు. తుమ్మలపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన మామిడి హేమ 101 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే కోయవారిపాలెం జడ్పీ పాఠశాలకు చెందిన ఉల్లంగుల లోక వివేకానందకు 95 మార్కులు, పాలపర్తి పూజితకు 77 మార్కులు ఈ స్కాలర్ షిప్‌లకు ఎంపికయ్యారు.

35 మందికి కృత్రిమ కాళ్లు పంపిణీ



కృత్రిమ కాలు అమర్చిన దివ్యాంగుడితో రోటరీ ప్రతినిధులు

మంగళగిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీ ఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జరుగుతున్న క్యాంపులో రెండో రోజైన శనివారం 35మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను పంపిణీ చేశారు. ప్రమాదవశాత్తు కాలు కోల్పోయిన దివ్యాంగులకు కాలి కొలతల ఆధారంగా కృత్రిమ కాళ్లను రూపొందించి అమర్చారు. కృత్రిమ కాళ్లను ఉపయోగించడం, నడవడం, మెట్లు ఎక్కడం, కాలు ముడుచుకుని కూర్చోవడం వంటి అంశాల్లో తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పూర్వ వర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, మంగళగిరి అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శి అందె మురళీ మోహన్‌రావు, ప్రాజెక్టు చైర్మన్ అనిల్ చక్రవర్తి, డైరెక్టర్లు పొరేపల్లి నిరంజన్ గుప్తా, వడ్లమూడి శ్రీనివాసరావు, చనుమోలు గోపాల్, ప్రెగడ రాజశేఖర్, అందె రేవంత్‌కుమార్ మాయకుంటి క్రాంతికుమార్, మునగపాటి నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమికి రుణపడి ఉంటాం

తాడికొండ(పొన్నెకల్లు), జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో ముగ్గురు పిల్లలు ఉన్న వారికి కూడా డబ్బులు వేసిన కూటమికి రుణపడి ఉంటామని తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలియజేశారు. శనివారం పొన్నెకల్లు గ్రామంలో సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంత మందికి తల్లికి వందనం రూ.15 వేలు వేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. నీటి సంఘం అధ్యక్షుడు, జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదనరావు మాట్లాడుతూ కూటమి పాలనలో అంతా మంచే జరుగుతుందన్నారు. అధికారంలోకి రాగానే పెన్షన్లు పెంపుదల, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్ రద్దు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటిన్లు పునరుద్ధరణ, రాజధాని అమరావతి నిర్మాణం ఇలా చెప్పుకుంటు పోతే చాలా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు నెల్లూరి కాంతారావు, ఐటీడీపీ నియోజకవర్గం అధ్యక్షుడు నెల్లూరి రాజశేఖర్, పాలేరు రమేష్, తేకల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలి


ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

మంగళగిరి సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు అన్ని ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నేత చెంగయ్య మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని మునిసిపల్ కార్మికులకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ పథకాలన్నింటినీ మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ఎం వెంకటేశ్వరమ్మ, వై శివనాగేశ్వరరావు, పీ మేరీ, పీ తిరుపతమ్మ, ఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● సీఐ నాగూర్ మీరా సాహెబ్

మేడికొండూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో నానాటికి పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మేడికొండూరు సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ చెప్పారు. మండలంలోని పేరేచర్ల జంక్షన్లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా పోలీసులమని చెప్పి మీరు కేసులో ఇరుక్కున్నారు, వెంటనే డబ్బు పంపకపోతే మిమ్మల్ని అరెస్ట్ చేస్తాం అంటూ ఫోన్లో ఎవరైనా బెదిరిస్తే వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్లో తెలియజేయాలని, అటువంటి బెదిరింపులకు ఎవరూ భయపడొద్దని చెప్పారు. ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాలు ఎక్కువ మంది వినియోగిస్తున్నారని దీని ఆధారంగా అనేక మోసాలు జరుగుతున్నాయని, బ్యాంక్ ఖాతాలోని నగదు మాయమై అనేకమంది పోలీసులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను మోసం చేస్తూ డబ్బు కాజేస్తున్నారని అన్నారు. అపరిచిత వ్యక్తులు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు చెప్పవద్దన్నారు. అనంతరం ఆ ప్రాంతంలోని ఆటోల, టిప్పర్ల యజమానులతో, డ్రైవర్లతోను సీఐ నాగూర్ మీరా సాహెబ్ మాట్లాడుతూ రహదారులపై వాహనాలు నడిపే వాళ్ళు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని లేదంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. లైసెన్స్ లేనివాళ్లు వెంటనే తీసుకొని వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులతో పాటు ఆటో టిప్పర్ డ్రైవర్లు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ ఆదేశాలతో ఎల్‌వోసీ చెక్కుల పంపిణీ


ఎల్‌వోసీ చెక్కులు పంపిణీ చేస్తున్న వల్లభనేని వెంకట్రావు తదితరులు

తాడేపల్లి టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఇద్దరికి అందజేశారు. తాడేపల్లి పట్టణం 4వ వార్డుకు చెందిన గుంజి నాగేశ్వరరావుకు రూ.5లక్షలు, 6వ వార్డుకు చెందిన గిద్దలూరు అజయ్‌కుమార్‌కు రూ.లక్ష ఎల్‌వోసీ చెక్కులను అందజేశారు. వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతోనే లక్షల విలువైన నిధులను సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తాడేపల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొయ్యగూర మహాలక్ష్మి, పట్టణ తెలుగుమహిళ అధ్యక్షురాలు అన్నెం కుసుమ, పత్రిపల్లి కృష్ణవేణి, కల్యాణి, క్రొత్తపాటి విజయ్, తాడి బోయిన గోపి, తురకా దుర్గారావు, కొయ్యగూర మల్లేశ్వరరావు, షేక్ అమీర్, దాసరి హరికృష్ణ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలను నిలపండి


రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఎయిమ్స్ వైద్య విద్యార్థులు

మంగళగిరి సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను నిలిపేందుకు ముందుకు రావాలని ఎయిమ్స్ వైద్యులు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది, వైద్య విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. రోగులు, రోగి బంధువులతో సమావేశం నిర్వహించి రక్తదానంపై అవగాహన పెంపొందించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో డాక్టర్ అహెంతెం శాంతాసింగ్, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీమంత కుమార్‌దాస్, ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దేసు రామమోహన్, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఆసరా 'తల్లికి వందనం'


అన్నక్యాంటిన్ వద్ద చిన్నారులు, తల్లిదండ్రులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న కూటమి నాయకులు

దుగ్గిరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం విద్యార్థులకు ఆసరాగా నిలుస్తుందని, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమచేస్తున్న సందర్భంగా, దుగ్గిరాలలోని అన్న క్యాంటిన్ వద్ద కేక్‌కట్ చేసి సంబరాలు శనివారం జరిపారు. ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థుల చదువు ఆగిపోకుండా, తల్లికి వందనం పథకం ద్వారా అందిస్తున్న ఆర్థికసాయం వారి భవిష్యత్తుకు బంగారుబాట వేస్తుందన్నారు. టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు వల్లూరు నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర విద్య, ఐటీ, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ ముందుచూపుతో ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా వారి తల్లుల ఖాతాల్లో 13వేల చొప్పున, పాఠశాల అభివృద్ధి కోసం రూ.2వేల చొప్పున నగదు జమచేస్తున్నారన్నారు. జిల్లా బీజేపీ మాజీ కార్యదర్శి కొంగర జోగేంద్రప్రసాద్, గద్దె శ్రీనివాస్, పర్వతనేని హర్ష, పసుపులేటి రవియాదవ్, ఎద్దు ప్రసాద్, వినోద్, పలువురు చిన్నారులు, తల్లిదండ్రులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజధాని రైతులకు కౌలు వెంటనే జమచేయాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్

తాడేపల్లి(ఉండవల్లి), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాజధానికి భూములిచ్చిన రైతులకు నేటికీ వార్షిక కౌలు జమకాలేదని వెంటనే సీఆర్‌డీఏ అధికారులు స్పందించి రైతులకు కౌలు జమచేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది మే కల్లా కౌలు జమచేయాల్సి ఉండగా ప్రస్తుతం జూన్ పూర్తి కావస్తున్నా ఇంతవరకు కౌలు జమకాలేదని జొన్నా శివశంకర్ అన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల త్యాగాలను ప్రభుత్వం విస్మరిస్తూ వారిని పట్టించుకోకుండా కౌలు జమలో తాత్సారం చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. రాజధాని రైతుల ప్లాట్లు అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని శివశంకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉదాసీనతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని వారిని ఇబ్బంది పెట్టడం తగదని శివశంకర్ అన్నారు. వెంటనే రైతుల కౌలు జమచేయాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో యోగాపై శిక్షణ


నడింపాలెంలో యోగాసనాలు వేయిస్తున్న శిక్షకులు

ప్రత్తిపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో బాగంగా ప్రత్తిపాడు మండలపరిధిలోని అన్ని గ్రామాల్లోని సచివాలయాల వద్ద అధికారులు, ప్రజలు యోగాసనాలు వేశారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకున్న వారికి ఈ తరగతులు నిర్వహించి యోగా వల్ల ఉపయోగాలను వివరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎంపీడీవో

ఫిరంగిపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : క్రమం తప్పకుండా యోగా చేయటం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవన శైలిని పొందవచ్చునని ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో శనివారం సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది ఉపాధి హామీ కూలీలు యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జే ప్రసాదరావు, ఏవో రవిబాబు, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆలూరులో పూరిల్లు దగ్ధం

పొన్నూరుటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామంలో పూరిల్లుదగ్ధమైన సంఘటన శనివారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం ఆలూరు గ్రామానికి చెందిన పోకూరి బాబూరావు శనివారం పనుల నిమిత్తం కుటుంబం అంతా వెళ్లారు. ఆ సమయంలో విద్యుత్ మీటర్ వద్ద మంటలు చెలరేగి గృహం కాలి బూడిదైనట్లు బాధితుడు వెల్లడించారు. ఇంట్లోని సామాగ్రి మొత్తం బూడిదైంది.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

చేగువేరాకు నివాళి

పొన్నూరుటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): క్యూబా విప్లవ వీరుడు చేగువేరా జయంతి ఉత్సవాలను శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, దిలీప్, శ్రీను, బడేషా, నిమ్మకాయల దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి నీహ

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలి

● వైద్యాధికారి నీహ

కొల్లిపర, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. శనివారం కొల్లిపరలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా నీహ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను పేదప్రజలు వినియోగించుకోవాలన్నారు. మెడికల్ క్యాంపుల ద్వారా దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునన్నారు. ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుస్మిత, ఏఎన్ఎం లక్ష్మి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు విజయ, జయప్రద, మల్లేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని గ్రేస్ ఫౌండేషన్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మాగాంధీ శాంతి ఆశ్రమంలో ఫౌండేషన్ అధినేత డాక్టర్ షాలేమ్‌రాజు పుట్టినరోజు సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి కనగల మధుసూదన్ ప్రసాద్, గొట్టిపాటి భానుగంగాధర్, ఇందుపల్లి రాజారాం, శుద్ధపల్లి మురళీధర్, కొండమూది రమేష్, అత్తోట రమేష్, మేకల సురేష్ పాల్గొన్నారు.

సైనికుడు-సేవకుడు సెంటర్ స్ప్రెడ్ ఆవిష్కరణ

తెనాలి అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సైనికుడు-సేవకుడు పుస్తక సెంటర్ స్ప్రెడ్‌ను త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించినట్లు సినీ దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. వైమానిక దళ మాజీ సైనికుడు సీబీఆర్ ప్రసాద్ జీవిత విశేషాలతో ముద్రిస్తున్న పుస్తకాన్ని తెనాలిలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. సిబిఆర్ స్పోర్ట్స్ అకాడమీ స్థాపించి 25సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తామన్నారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోటూరు శంకరరావు, కార్యదర్శి అయినంపూడి రత్నప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కేసన శంకరరావు అభినందన సభ

తెనాలి అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావుకు ఆదివారం అభినందన సభ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం పట్టణ పౌర సంఘం పేరిట పలు సంఘాలు ఆయన చేస్తున్న కృషిని గుర్తించి తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పౌర సత్కారం ఏర్పాటు చేశారు. జొన్నాదుల నరసింహారావు అధ్యక్షతన నిర్వహించనున్న సభలో పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న నన్నపనేని శివాజీ

పెదకాకాని, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరయ్య కాలనీ, స్వర్ణపురి కాలనీ, ఎస్టీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ, జాన్‌హార్స్‌ఫర్ కాలనీవాసులు ప్రభుత్వ స్థలాలలో నివాసాలు ఏర్పాటుచేసుకొని జీవిస్తున్నారని, వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ కోరారు. శనివారం సుందరయ్య కాలనీలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు వారందరికీ ఇళ్ల పట్టాలిస్తామని హామీ ఇచ్చిందన్నారు. శివారు కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీ బాబురావు, బీ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే కబేళా!

● అపరిశుభ్ర వాతావరణంలో మాంసపు విక్రయాలు
● కబేళా ఉన్నా.. రోడ్లపై కోతలు
● నిద్రావస్థలో అధికారులు


రోడ్డుపైనే మాంసం విక్రయాలు చేస్తున్న షాపు యజమానులు


మహాత్మగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్ రోడ్డులో అపరిశుభ్ర వాతావరణంలో మాంసం విక్రయాలు


చెంచుపేటలో బిర్యానీ అమ్మకాలు...

తెనాలి, మారీసుపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘం కొన్ని నిబంధలనతో ప్రత్యేక జంతు వధశాలలను ఏర్పాటు చేసింది. కానీ, దానిని అమలు చేయడంలో మాత్రం ఆసక్తి కనపర్చడంలేదన్న.. విమర్శలు అధికమయ్యాయి. బహిరంగ ప్రదేశాల్లో జంతు వధ చేయకూడదనే నిబంధలున్నా.. మాంసపు విక్రయదారులు దానిని పట్టించుకోవడం లేదు. బహిరంగంగానే జంతు వధ చేస్తూ..మాంసపు విక్రయాలు చేస్తున్నారు. వ్యర్థాలను రోడ్లపైనే పోసేస్తున్నారు. దీంతో అపరిశుభ్ర వాతావరణం అక్కడ తాండవిస్తోంది. ప్రధానంగా రజక చెరువు రోడ్డులో బహిరంగంగానే జంతువధ చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న తూర్పు కాలువ రోడ్డులో ఇదే తంతు కొనసాగుతోంది. చెంచుపేట, వీఎస్ఆర్ కాలేజీ రోడ్డు, తెనాలి మంగళగిరి రోడ్డులో విచ్చలవిడిగా అపరిశుభ్రవాతావరణంలో మాంస విక్రయాలు జరుగుతున్నాయి. తెనాలిలోని నాన్‌వెజ్ హోటల్స్ అన్నిటికీ.. అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న మాంసాన్ని విక్రయిస్తున్నారని తెలుస్తోంది. వేలాది మంది తినే మాంసాహారంపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో.. ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మాంసం విక్రయాలు చేస్తున్న షాపులు, నాన్‌వెజ్ హోటల్స్‌లో తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవాటిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, పలు ప్రజాసంఘ నాయకులు కోరుతున్నారు.


ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో బహిరంగంగా మాంసం విక్రయాలు


రజక చెరువు సెంటర్‌లో మాంసం విక్రయాలు...


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందిస్తున్న మంత్రి మనోహర్

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

● మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో వైద్యసేవలు పొందేందుకు ఆర్థిక ఇబ్బందులున్న వారికి సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా వైద్య ఖర్చులు అందించి వారికి భరోసాగా నిలిచామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శనివారం పట్టణ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో 29మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.41 లక్షల 73వేల చెక్కులను మంత్రి మనోహర్ అందించారు. పలువురు కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అగతవరప్పాడులో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వంద పడకల సామర్థ్యంతో గుంటూరులోని అతి పెద్ద ఆయుర్వేదిక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటలైన శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం అగతవరప్పాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ఎండీ, ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు అనుభవజ్ఞులైన పంచకర్మ వైద్యనిపుణులు రోగులకు నాడి పరీక్షించి కీళ్ల నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటిక, పక్షవాతం, మోకాళ్ల అరుగుదల, ఆస్మా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మవ్యాధులు, సొరియాసిస్, పైల్స్, హెచ్ఐవీ/ఎయిడ్స్, వెన్నుపూస సంబంధిత వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఉచితంగా మందులు ఇస్తారని ఆయన వివరించారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు వినియోగించుకొని వైద్యసేవలతో పాటు బీపీ, షుగర్ తదితర వ్యాధులకు ఆయుర్వేద మందులు పొందాలని డాక్టర్ వెంకటేశ్వర్లు కోరారు.

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్/చేబ్రోలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని వేజెండ్ల, శలపాడు గ్రామాలలో శనివారం రూ.1.14కోట్ల అభివృద్ధిపనులకు శంకుస్థాపనలు జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబుతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే స్థానిక మహిళలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ శలపాడులో చెరువు మరమ్మతులకు సహకారం అందిస్తామన్నారు. అందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులు డొంకరోడ్ల అభివృద్ధికి విజ్ఞాపనలు అందించినట్లు తెలిపారు. వీటన్నింటిని రాబోయే రోజులలో పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.


పొన్నూరు: రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్


పెదకాకాని: నంబూరులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర, అధికారులు, పార్టీ నాయకులు

పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

పెదకాకాని, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకాకాని, నంబూరు, వెనిగండ్ల గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ శ్రీకారం చుట్టారు. శనివారం ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.1.25 కోట్ల జల్‌జీవన్ మిషన్ నిధులతో పెదకాకాని గ్రామంలోని వెంగళరావు నగర్, ఎన్టీఆర్ కాలనీ, స్వర్ణపురి కాలనీలకు కలిపి మంచినీటి ట్యాంక్, పైపుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నంబూరులో రూ.15లక్షల మండల ప్రజాపరిషత్ నిధులతో నంబూరు సెంటర్ నుంచి గంగమ్మగుడి వరకు సీసీరోడ్డు, కాల్వ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వెనిగండ్లలో మంచినీటి ట్యాంక్, పైపుల నిర్మాణానికి, అదనపు బోరు, మోటారు, పైపులైన్‌ల నిర్మాణానికి, పీహెచ్‌సీ దగ్గర మంచినీటి సంపు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు వడ్రాణం మార్కండేయబాబు, మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


తూములూరు సమీపంలో బూతిమిల్ కాల్వలో పూడిక తీస్తున్న ప్రొక్లెయిన్

పూడికతీత పనులు నిర్ణీత సమీపంలో పూర్తి చేయాలి

● డీసీ వైస్ చైర్మన్ తోట ఏడుకొండలు

కొల్లిపర, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ దగ్గర పడుతోందని.. పంట కాల్వల పూడికతీత పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని డీసీ వైస్ చైర్మన్ తోట ఏడుకొండలు అన్నారు. శనివారం మండలంలోని పిడపర్తిపాలెం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, చివలూరు, దావులూరు, వల్లభాపురం, అత్తోట తదితర గ్రామాల్లో పంటపొలాల్లో నిర్వహిస్తున్న కాల్వల పూడికతీత పనులను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ మండలంలో సంవత్సరాల తరబడి పంట కాల్వలు పూడికతీత పనులు నోచుకోకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం కొల్లిపర మండలానికి పంట కాల్వల పూడికతీత పనులకు రూ.25లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రవిబాబు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు బి. శ్రీరాములరెడ్డి, కోటా వీరాంజనేయులు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు జొన్నల నాగిరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

● అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు యోగ సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌతుందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అన్నారు. శనివారం స్థానిక మారీసుపేటలోని నల్లమోతు చెంచురామానాయుడు పురపాలకోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న యోగాంధ్ర శిక్షణ శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. యోగా ఒత్తిడిని, ఆందోళనను తగ్గిస్తుందని, ముఖ్యంగా విద్యార్థులలో మానసిక ఏకాగ్రతను పెంచుతుందన్నారు. విద్యార్థులు యోగ సాధనతో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవచ్చని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంచుకోవచ్చన్నారు. అనంతరం పట్టణంలో వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్న యోగాంధ్ర శిక్షణ శిబిరాలను పరిశీలించారు. ఈ శిబిరాలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


యోగా ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఎంపీడీవో దీప్తి, కీర్తి, ప్రసాద్ తదితరులు

యోగాతో అదుపులో ఒత్తిడి

● ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలిరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఎంపీడీవో అత్తోట దీప్తి చెప్పారు. శనివారం మండలంలోని అంగలకుదురు సచివాలయంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎంపీడీవో దీప్తి, ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్‌లు పాల్గొని ట్రైనర్ కీర్తి ద్వారా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం దినచర్యగా పాటిస్తే మంచి ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. యోగాసనాల ద్వారా అనేక వ్యాధులు నయం కావడంతో పాటు రోగనిరోధక శక్తిని కూడా పెంచుకోవచ్చన్నారు. ఈ మధ్య కాలంలో రకరకాల అనారోగ్యసమస్యలతో బాధపడేవారు పెరిగిపోతున్నారని, ప్రతి రోజు ఒక గంట యోగా చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం ప్రాప్తిస్తుందన్నారు. పిల్లల నుండి పెద్దలు, వృద్ధులు సైతం ఆసనాలు నేర్చుకుని మంచి ఆరోగ్యకరమైన జీవితం గడపాలని కోరారు.


ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

వైకుంఠపురంలో స్వామివారికి ఊంజల్ సేవ

తెనాలి అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయంలో శనివారం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి కీర్తనలు ఆలపించారు. బ్రహ్మోత్సవాల అనంతరం ప్రతి శనివారం సాయంత్రం 6గంటల నుండి ఈ కార్యక్రమం చేపట్టామని ఈవో అనుపమ తెలిపారు. అన్నమాచార్య సంకీర్తనా బృందం నిర్వాహకులు కొండపి వసుంధర ఆధ్వర్యంలో మహిళలు కీర్తనలు ఆలపించారు.

డేటాను ఒకే ఫార్మాట్‌లో సమీకరించాలి

● ప్రొఫెసర్ శ్రీనివాసకుమార్

గుంటూరు(విద్య), జూన్ 14(ఆంధ్రజ్యోతి): వివిధ వనరుల నుంచి వచ్చిన డేటాను ఒకే విధానంలో సమీకరించడానికి ఆన్‌టాలజీలు ఉపయోగపడతాయని మద్రాస్ ఐఐటీ సీఎస్ఈ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మాటిక్స్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో "సెకండ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నెట్‌వర్క్స్ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్" అనే అంశంపై మూడురోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్ శనివారం ముగిసింది. ముఖ్య అతిథి ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసకుమార్ మాట్లాడారు.

కాలువల్లో వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తెనాలి మారీసుపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మారీసుపేటలోని అప్పలస్వామి గుడి రోడ్డు, మఠం బజార్‌లలో కాలువలలో వ్యర్థాలు పేరుకొని, మురుగు పారక అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కదలని మురుగు, వ్యర్థాలతో నిండిన కాల్వలు అని శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శనివారం పారిశుధ్య కార్మికులను ఆ ప్రాంతానికి పంపించి కాలువలలోని వ్యర్థాలను, పిచ్చిమొక్కలను తొలగించి మురుగు పారేలా చర్యలు చేపట్టారు.


కాలువలో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

మైనర్‌లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

పొన్నూరుటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మైనర్‌లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ వీరానాయక్ హెచ్చరించారు. పట్టణంలో శనివారం వాహన తనిఖీలు నిర్వహించి వాహనాలు నడుపుతున్న మైనర్లను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మైనర్‌లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులకు జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ తనిఖీలలో అర్బన్ ఎస్ఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.


మైనర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వీరానాయక్

టాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ప్రసాద్


టాక్స్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పొన్నూరు టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పొన్నూరు టాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కేఎస్ఎస్ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని శుభప్రదం కన్వెన్షన్ హాల్‌లో శనివారం పొన్నూరు టాక్స్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమాలు జరిగాయి. అధ్యక్షుడిగా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, కోశాధికారిగా కొత్తూరి సుబ్బారావు, మరో 15 మంది కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది. బాపట్ల టాక్స్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాలాజీరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ ఆడిటర్లు ప్రసాద్, షేక్ కాలేషా, నాగూర్ మీరా, గౌసియా, సురేష్‌కుమార్, ఎం చంద్రశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.